కావలి మున్సిపల్ ఎన్నికలు జరిగేనా?

కావలి మున్సిపల్ ఎన్నికలు డిసెంబర్ లేక జనవరిలో జరుగుతాయని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గతేడాది అక్టోబర్ 21న చెప్పారు. ఇక్కడ ఎన్నికలు జరగనందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మున్సిపాలిటీకి నిధుల మంజూరుకు ఇబ్బందిగా ఉందని, అందువల్లే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పలు సందర్భాల్లో ఆయన వెల్లడించారు. అయితే చెప్పిన గడువు ముగిసి నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అసలు మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



కావలి మున్సిపాలిటీ కార్యాలయం

- డిసెంబర్ లేదా జనవరి అని చెప్పిన ఎమ్మెల్యే
- గడువు ముగిసినా జాడలేని ఎన్నికల కసరత్తు

కావలి : కావలి మున్సిపల్ ఎన్నికకు ప్రధాన అడ్డంకిగా ఉన్న చౌదరిపాళెం గ్రామ పంచాయతీ విలీన ప్రక్రియను విరమింపజేస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి గతంలో తెలిపారు. ప్రభుత్వ ఆమోదం కూడా వెలువడి ఎన్నికల ప్రక్రియకు సిద్ధం అవుతుందని చెప్పారు. అలాగే అల్లూరు నగర పంచాయతీని రద్దు చేస్తూ అందులో ఉన్న అల్లూరు, నార్త్ మోపూరు, సింగపేట గ్రామ పంచాయతీలను వేర్వేరుగా ప్రకటించేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు వివరించారు. దీంతో చౌదరిపాళెం గ్రామ పంచాయతీతో పాటు అల్లూరు, నార్త్ మోపూరు, సింగపేట గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగడానికి మార్గం ఏర్పడుతుందని అందరూ భావించారు. అయితే ఆశలన్నీ అడియాశలయ్యాయి.

అసలేం జరిగిందంటే..

రాష్ట్రంలో 2021లో మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పటికీ, నియోజకవర్గంలోని కావలి మున్సిపాలిటీ, అల్లూరు నగర పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. హైకోర్టులో వ్యాజ్యాలు ఉండడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ రెండు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరపలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి కావలి మున్సిపల్ ఎన్నికలను జరిపించాలని పట్టుదలగా ఉన్నారు. ప్రభుత్వ చర్యల ద్వారా ఎన్నికలు నిర్వహించడానికి అడ్డంకులు తొలగినట్లే అని అధికారులు కూడా అభిప్రాయపడ్డారు.

2014లో చివరి ఎన్నికలు

పట్టణానికి ఆనుకొని ఉన్న ముసునూరు, మద్దూరుపాడు, బుడంగుంట గ్రామ పంచాయతీలను 2013లో కావలి మున్సిపాలిటీలో విలీనం చేసిన తర్వాత, 2014లో ఎన్నికలు జరిగాయి. గెలుపొందిన పాలకవర్గం 2019 పదవిలో ఉన్నారు. అనంతరం కావలి మున్సిపాలిటీలో చౌదరిపాళెం గ్రామ పంచాయతీని విలీనం చేసే ప్రక్రియ జరిగింది. ఈ ప్రక్రియను వ్యతిరేకించిన చౌదరిపాళెం గ్రామస్తులు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీంతో 2021 మార్చిలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తే, హైకోర్టులో వ్యాజ్యం నడుస్తుండటంతో కావలి మున్సిపాలిటీకి ఎన్నికల నిర్వహించడానికి సాధ్యపడలేదు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి మున్సిపాలిటీ నుంచి 'డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్' (డీఎంఏ)కు ప్రతిపాదనలు వెళ్లాయి. అందులో చౌదరిపాళెం గ్రామ పంచాయతీ విలీన ప్రక్రియను విరమించుకున్నట్లుగా పంపింది. అంతిమంగా ప్రభుత్వం ఈ అంశాలకు ఆమోదం తెలిపితే చౌదరిపాళెం గ్రామ పంచాయతీగా పునరుద్ధరణ జరిగి, కోర్టులో వ్యాజ్యం వేసిన వ్యక్తులు ఉపసంహరణ చేసుకోవడమో, కోర్టు కొట్టేయడమో జరుగుతుంది. అప్పుడు కావలి మున్సిపాలిటీకి ఎన్నికలు జరగడానికి లైన్ క్లియర్ అవుతుంది.

గ్రామ పంచాయతీగా అల్లూరు

అల్లూరు గ్రామ పంచాయతీని 2020లో నగర పంచాయతీగా చేశారు. ఇందుకోసం పక్కనే ఉన్న నార్త్ మోపూరు, సింగపేట గ్రామ పంచాయతీలను కూడా అల్లూరులో విలీనం చేశారు. ఈ ప్రక్రియపై కూడా హైకోర్టులో వ్యాజ్యం దాఖలు కావడంతో ఎన్నికలు జరగలేదు. కాగా అల్లూరును నగర పంచాయతీగా కాకుండా గ్రామ పంచాయతీగానే ఉండేలా, నార్త్ మోపూరు, సింగపేటలు కూడా గ్రామ పంచాయతీలుగా ఉండేలా అల్లూరు నగర పంచాయతీ నుంచి 'డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్' (డీఎంఏ)కు ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ మేరకు గ్రామ పంచాయతీలుగా చేయాలని డీఎంఏ నుంచి పంచాయతీరాజ్ శాఖకు ప్రతిపాదనలు చేరాయి. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే మూడు గ్రామ పంచాయతీలుగా ఏర్పడుతాయి. అలాగే కోర్టులో వ్యాజ్యం కూడా రద్దవుతుంది. అల్లూరు, సింగపేట, నార్త్‌మోపూరు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి మార్గం ఏర్పడుతుంది.

క్లుప్తంగా

పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహక బహుమతులు



అల్లూరు : మండల పరిధిలోని నార్త్ మోపూరు గ్రామంలో విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఎండీ పి.కృష్ణమోహన్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

అన్నదానం

సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల ప్రాజెక్టు వద్ద స్థానిక జాలర్లు ఆదివారం గంగమ్మ తల్లికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

- అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ



ఆత్మకూరు : క్షేత్రస్థాయిలో డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. పట్టణంలోని టిడ్కో భవనాల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఐసీడీఎస్ సీడీపీఓలు వినీలత, ఎం.పద్మావతి తమ సిబ్బందితో కలిసి వైద్యసేవల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వైరల్ ఫీవర్‌లు ప్రబలుతున్నాయని, ఎప్పటికప్పుడు సిబ్బంది వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించడంతో తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. రక్త పరీక్షలు నిర్వహించాలని, నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ అస్మా, ఎంపీహెచ్ఈఓ సుధాకర్, ఏఎన్ఎం పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మెగా టాలెంట్ టెస్టుకు విశేష స్పందన



సోమశిల : అనంతసాగరం మండల కేంద్రంలోని టీజేఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మెగా టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించింది. నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మొదటి మూడు స్థానాల్లో చేజర్ల మండలం మాముడూరుకు చెందిన టి.చందనలక్ష్మి, సంగం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జి.స్వర్ణభారతి, చేజర్ల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన మహేంద్ర నిలిచారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి మొదటి మూడు స్థానాల్లో చేజర్ల లుంబిని పాఠశాలకు చెందిన కె.హిమవర్ష, అనంతసాగరం శాంతినికేతన్ పాఠశాలకు చెందిన లహరిప్రియ, సంగం వికాస్ పాఠశాలకు చెందిన మహిధర్ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో సాంబశివ చారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి, ఆపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చక్రపాణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజగోపాలాచార్యులు, పి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికల గురుకులానికి దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుమతి

సంగం : సంగం బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుమతి ఆదివారం తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదివే వారు ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులని, అదేవిధంగా ప్రస్తుతం పదో తరగతి చదివే వారు జూనియర్ ఇంటర్‌కు అర్హులని తెలియజేశారు. సోమవారం నుంచి మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

దుత్తలూరు : మండలంలోని నర్రవాడలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్రవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉజ్వల భవితకు చదువే మార్గం



టాలెంట్ టెస్టు విజేతలతో యూటీఎఫ్ నేతలు

వింజమూరు(ఉదయగిరి) : విద్యార్థుల ఉజ్వల భవితకు చదువు ఒక్కటే మార్గమని, ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని మాజీ ఐఏఎస్ అధికారి వెలుగోటి రాములు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీయూటీఎఫ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి టాలెంట్ టెస్టు పరీక్షలు ఆదివారం నిర్వహించి ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాములు హాజరై, మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యం దిశగా సాగాలని కోరారు. కాగా టాలెంట్ టెస్టులో నియోజకవర్గంలోని 42 పాఠశాల నుంచి 320 మంది విద్యార్థులు పాల్గొనగా, ఎ.సాయితేజ(గుండెమడుగుల), జ్ఞాపిక (వింజమూరు), యశ్వంత్ (వింజమూరు) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరితో పాటు మరో ఏడుగురికి ప్రత్యేక నగదు బహుమతలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంతి డీఎంహెచ్ఓ మాసిలామణి, యూటీఎఫ్ నేతలు చలపతి శర్మ, బాల రాఘవులు, చెంచలబాబు, వెంకటేశ్వరరెడ్డి, యర్రా పరమేశ్వరరావు, వీరాంజనేయులు, రాము, శివకుమార్, సుబ్బారావు, హెచ్ఎం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా గ్రావెల్ తవ్వకాలు



ఉదయగిరి చెరువు నుంచి రాత్రివేళల్లో సాగుతున్న మట్టి తవ్వకాలు

ఉదయగిరి : నియోజకవర్గంలోని పలు మండలాల్లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వరికుంటపాడు మండలం విరువూరు రెవెన్యూ పరిధిలో స్థానిక లేఅవుట్ల కోసం పామూరుకు చెందిన వ్యక్తులు శనివారం రాత్రి జేసీబీలు పెట్టి ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తరలించారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు జేసీబీతో పాటు ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అయితే దీనిపై కేసు నమోదు చేయలేదు. కాగా ఉదయగిరి చెరువు నుంచి ఇసుక బట్టీల కోసం రాత్రి వేళల్లో జేసీబీలను ఉపయోగించి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి



ఉదయగిరి ట్యాంక్ బండ్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

ఉదయగిరి : ఉదయగిరి మెట్ట ప్రాంతంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులను పూర్తి చేసేందుకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ట్యాంక్ బండ్‌పై ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభం కాగా నేటికీ పూర్తి కాకపోవడంతో వేలాది కుటుంబాలు వలస వెళ్తున్నట్లు చెప్పారు. వచ్చే బడ్జెట్‌లో అయినా వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులను కేటాయించి పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాకు వెంకటయ్యతో పాటు సీపీఎం కార్యకర్తలు, అనుబంధ సంఘాలు పాల్గొన్నాయి.

భగవద్గీతపై ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న సమితి సభ్యులు

వింజమూరు(ఉదయగిరి) : స్థానిక వింజమూరు బీసీ కాలనీలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి భగవద్గీత పఠనం గురించి వివరించారు. సేవా సమితి సభ్యులు ప్రసాద్, సుధాకర్, మహేంద్ర, మధు, వెంగమ్మ తదితరులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి..

- ఇద్దరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

దుత్తలూరు : బైక్ అదుపుతప్పి పడడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని నందిపాడు సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఉదయగిరి మండలం జి.చెరువుపల్లి గ్రామానికి చెందిన హరీష్, గోపి పనినిమిత్తం నందిపాడుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా నందిపాడు గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తరలించారు.

50 ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం



అలనాటి గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కావలి : కావలి విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో సుమారు 50 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట చేరి గోల్డెన్ జూబ్లీ సమ్మేళనం పేరుతో సంబరాలు నిర్వహించారు. విశ్వోదయలో 1974–75 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సుమారు 60 మంది హాజరై, అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించడంతో పాటు భౌతికంగా లేని గురువులకు అంజలి ఘటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాతస్నేహితులతో సరదాగా గడిపారు. పాఠశాల పూర్వవిద్యార్థి, విశ్వోదయ సంస్థలకు చెందిన దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన పూర్వ విద్యార్థులు నిరంజన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డిలకు అభినందనలు తెలిపారు.

రాజగోపాల్‌రెడ్డి ఆశీర్వాదం



వధూవరులతో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి : మండలంలోని గానుగుపెంటపల్లిలో చిన ఓబుల్‌రెడ్డి నివాసంలో ఆదివారం జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని వధూవరులు తన్మయరెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలను ఆశీర్వదించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఓబులరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మోదీ రామాంజనేయులు, స్థానిక నేతలు వీరారెడ్డి, కృష్ణారెడ్డి, యస్దాని, శ్రీనివాసరెడ్డి, పల్లాల కొండారెడ్డి, బాలిబోయిన శ్రీనివాసులు, తిరుపతినాయుడు, యర్ర ఓబయ్య పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో రాజగోపాల్‌రెడ్డి భేటీ అయి పలు అంశాలపై చర్చించారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య



విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్ : వ్యవసాయశాఖ ద్వారా పట్టా భూమి కలిగిన ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె ఆదివారం పాల్గొని, మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సిబ్బంది సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ సంబంధిత సేవలు రైతులకు అందించేందుకు, పంటల బీమా ప్రయోజనాలు పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శేషగిరిరావు, ఆత్మకూరు సబ్ డివిజన్ ఏడీఏ దేవసేనమ్మ, నర్సోజీరావు తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు కిశోర్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని రెండు గేదెలు మృతి

సోమశిల : కారు ఢీకొని రెండు గేదెలు మృతిచెందిన ఘటన అనంతసాగరం మండలం పాతాళపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని పాతాళపల్లి వద్ద హైవేపై ఉన్న గేదెలను ఓ ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు గేదెలు మృతిచెందగా కారు ముందు భాగం దెబ్బతింది. కారు అహోబిలం నుంచి చెన్నైకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

అల్లుకుపోతున్న నిర్లక్ష్యం



దుత్తలూరు-లక్ష్మీపురం మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు



సోమలరేగడ గ్రామానికి వెళ్లే మార్గంలో..



బ్రహ్మేశ్వరం జాతీయ రహదారి పక్కన ఇలా..



దుత్తలూరు గ్రామంలో..

- ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు అల్లుకుపోయిన చెట్ల తీగలు
- పట్టించుకోని అధికారులు

దుత్తలూరు : విద్యుత్ శాఖకు నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుంది. దుత్తలూరు మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్‌పరమైన సమస్యలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. దీంతో గ్రామానికి వెళ్లే ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల చిన్నపాటి గాలి వీచినా, వర్షం కురిసినా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.

గ్రామాల్లో..

బ్రహ్మేశ్వరం గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీగల అల్లుకొని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నర్రవాడలోని పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అంతేకాక ఫ్యూజ్ క్యారియర్లు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల దుత్తలూరు సెంటర్‌లో జాతీయ రహదారి, బ్రిడ్జి ఏర్పాటులో భాగంగా ఏర్పాటు చేసిన స్తంభాలు ఇష్టారీతిన అమర్చారనే విమర్శలు ఉన్నాయి. దుత్తలూరు సెంటర్‌లో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలేదు. దుత్తలూరు గ్రామంలో స్తంభాలు, విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అల్లుకొని గాలి వీచినప్పుడల్లా మంటలు చెలరేగుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దుత్తలూరు చెరువు కట్టమీద గతంలో స్తంభాలు కూలినా ఇంతవరకు వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయలేదు. దీంతో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే లక్ష్మీపురం, కొత్తపేట, తెడ్డుపాడు, తిమ్మాపురం తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీసీ రుణాల గడువు 12కు పెంపు

జలదంకి : బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువును ఈనెల 12 వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో ఉంచుకుని గడువును పెంచినట్లు చెప్పారు. బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.